

నేడు ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల ఐదో తేదీన ఉదయం 9.30 గంటలకు నగరంలోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించనున్నట్లు ఎన్ఎజె జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సత్తారు భాస్కరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కృష్ణ, జి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల హక్కులు-బాధ్యతలు-చట్టాలు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు, పాత్రికేయ సంఘాలు, పాత్రికేయులు హాజరు కావాలని కోరారు.

- ఆరు నెలల తర్వాత రెండో సమావేశం
- జిల్లాలో ముసురుకున్న అనేక సమస్యలు
- 'మొంథా' నష్ట పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు
- అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య
- నేడు జెడ్‌పిలో జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం



ఎట్టకేలకు..!

ఎట్టకేలకు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డిడిఆర్‌సి) సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది రెండో సమావేశం. వాస్తవానికి ప్రతి మూడు నెలలకోసారి డిడిఆర్‌సి నిర్వహించాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలిసారి సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 15న సమావేశ నిర్వహణకు తేదీ నిర్ణయించినా, పలు కారణాలతో వాయిదా వేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో అనేక సమస్యలు ముసురుకున్నాయి. మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు పరిహారం కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. వీటితోపాటు షట్టర్ల సమస్య, కరకట్టలు వంటి దీర్ఘకాలిక సమస్యలూ ఉన్నాయి. ఎన్‌టిఆర్ ఇళ్ల బిల్లులు పెండింగ్, విద్యుత్, ఆర్‌అండ్‌బి రోడ్లు వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తుపాను ప్రభావంతో జిల్లాలో సుమారు 5,582.98 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అందులో జిల్లాలో వరి పంటకు సంబంధించి 4,801 మంది రైతులకు చెందిన 5,568.75 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. జిల్లాలో 13 మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. పత్తి పంట సుమారు 13 ఎకరాల్లో దెబ్బతింది. ఇచ్ఛాపురం, పాతపట్నం, నందిగాం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల మండలాల్లో వరి, కొత్తూరు మండలంలో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. తుపాను, ఈదురుగాలుల కారణంగా ఉద్యాన పంటలకు 14.23 ఎకరాల మేర నష్టం వాటిల్లింది. అందులో 28 ఎకరాల్లో జీడి, 1.12 ఎకరాల్లో అరటి, ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి, ఐదు ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం సంభవించింది. పంట నష్ట పరిహారం కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు.

రంగు మారిన ధాన్యంపై రైతుల్లో ఆందోళన

వరి పంట సుమారు 5,583 ఎకరాల్లో నీట మునగడంతో ధాన్యం రంగు, తేమ శాతంపై ప్రభావం చూపే అవకాశముందని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం మునిగిన పంట మేరకు సుమారు లక్ష క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ముందని అధికారులు భావిస్తున్నారు. రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు తేమ శాతంలో సడలింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

షట్టర్ల సమస్యకు ఏం పరిష్కారమో?

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. దాదాపు 15 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గోడౌన్లలో సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు రాక ఇబ్బందులు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 37,215 ఇళ్లకు రూ.50.33 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తి చేసి పది నెలలు కావస్తున్నా, ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అసంపూర్తిగా రోడ్ల నిర్మాణ పనులు

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతో హడావుడిగా పల్లె పండగ పేరుతో రోడ్ల నిర్మాణాలను ప్రారంభించినా, చాలాచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 8,951 రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.1357 కోట్లు మంజూరు చేశారు. ఇందులో 3,087 రోడ్ల పనులే పూర్తయ్యాయి. పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఏడాది కాలంగా రోడ్ల పనులను ఆపేశారు. జిల్లాలో 300 కోట్ల వరకు బిల్లులను అప్‌లోడ్ చేయగా ప్రభుత్వం రూ.194 కోట్లను మాత్రమే చెల్లించింది.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పక్కాగా పంట నష్ట నివేదికలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జిల్లాలో మొంథా తుపాను పంట నష్ట నివేదికలు పక్కాగా రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం చేయాలన్నారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి వెళ్లి పంట నష్ట వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి పరిహారం అందాలని స్పష్టం చేశారు. పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలిచి పక్కాగా నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. టెక్కలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాసిరకమైన పనులు జరిగితే సహించేది లేదని, అందుకు పర్యవేక్షణ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రధానంగా డ్రైనేజీ, సిసి, బిటి రహదారులు పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జగన్... చర్చకు సిద్ధమా..!

రైతుల సమస్యలపై చర్చించడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీకి రావాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. మండలంలోని కిష్టుపురంలో రూ.28.50లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిష్టుపురంలో గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 16 నెలల్లో రూ.రెండు కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో వంశధార రిజర్వాయర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఈ వారంలో రూ.7 వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. మరో రూ.ఆరు వేలు వచ్చే నెలలో జమ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, వెలమల విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, నాయకులు కామేశ్వరావు, రామకృష్ణ, కర్రి అప్పారావు, సాసుమంతు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో రద్దీ నియంత్రణకు చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని అన్ని ప్రధాన ఆలయాల్లో భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన రద్దీ నియంత్రణ వ్యవస్థను అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్తీక సోమవారాలు, పౌర్ణమి వంటి ముఖ్య రోజుల్లో భక్తుల సంఖ్య పెరుగుతున్నందున క్యూలైన్లు, భద్రత, ప్రసాదం కౌంటర్లు, పార్కింగ్ నిర్వహణ విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని మతపరమైన, లౌకిక కార్యక్రమాలతో పాటు, శివాలయాలు, నదీ తీరాల్లో రద్దీ పెరిగే కార్తీక మాసంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను తక్షణం సిద్ధం చేయాలన్నారు. ఆలయాలు, స్నానాల ఘాట్ల వద్ద రద్దీ నియంత్రణకు సూచనలు చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ అని తేడా లేకుండా అన్ని ఆలయాల్లో కనీసం రెండు సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. పోలీసు యంత్రాంగం, ఆలయ కార్యనిర్వహణ అధికారులు, స్థానిక సంస్థలు సమన్వయం చేసుకుంటూ భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించాలని దిశానిర్దేశం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, నందిగాంలో ఇంకా ప్రారంభం కాని అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని చేరుకోవడానికి, 5,500 వాహనాలకు జిపిఎస్ వినియోగం సాధ్యం కానందున, తొమ్మిది బృందాలను ఏర్పాటు చేసి ట్రాకింగ్ డివైజ్‌లు ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. జిల్లాలో 200 ఈ-హబ్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి లక్ష్మణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశువుల శాల దగ్ధం

- రెండు ఆవులు, నాలుగు దూడలు సజీవ దహనం
- ఆటో, రెండు బైక్‌లు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని పాతర్లపల్లి పంచాయతీ పరిధి వెంకటేశ్వర కాలనీలోని పశువుల శాలలో సోమవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు ఆవులు, నాలుగు దూడలు సజీవ దహనమయ్యాయి. అదే శాలలో ఉన్న ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర కాలనీకి చెందిన పిన్నింటి అప్పలనాయుడు ఊరు చివరన ఉన్న పశువుల శాలలో సోమవారం సాయంత్రం పశువులను కట్టేసి, అదే శాలలో ఆయనకు చెందిన ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు పశువుల శాలకు నిప్పంటుకుంది. సమీపంలోని రైతులు అప్పలనాయుడుకి సమాచారం అందించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆయన పశువుల శాల వద్దకు చేరుకునేసరికే రెండు ఆవులు, నాలుగు దూడలు మంటల్లో సజీవ దహనమయ్యాయి. మృతి చెందిన రెండు ఆవులు, నాలుగు దూడల విలువ రూ.రెండు లక్షల వరకు ఉంటుందని, ఆటో, రెండు ద్విచక్ర వాహనాల విలువ రూ.మూడు లక్షల వరకు ఉంటుందని అప్పలనాయుడు వావాపోయాడు. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని కోరాడు. రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, తదితర నాయకులు, అధికారులు సంఘటనా స్థలాన్ని మంగళవారం పరిశీలించి బాధిత రైతుని పరామర్శించారు.



ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - రణస్థలం

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని రావాడ పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలన్నారు. రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశాలకు ఆరేళ్లుగా ఒక్క రూపాయి వేతనం పెంచలేదన్నారు. ఆశాలకు ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, అయినా రకరకాల యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 5జి సపోర్టుతో పనిచేసే ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించాలని కోరారు. డిసెంబరు 31 నుంచి 2026 జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో పలురంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిల భారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు.



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ఎచ్చెర్ల ఎంపిపిగా విజయకుమారి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండల పరిషత్ ఉపాధ్యక్షులు-2 జరుగుళ్ల విజయకుమారిని ఎంపిపిగా నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఎంపిపిగా ఉన్న మొదలవలస చిరంజీవి పీడీ యాక్టుపై అరెస్టు అయి విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్నారు. దీంతో వైస్ ఎంపిపిగా ఉన్న విజయకుమారిని ఎంపిపిగా నియమించారు. మండల పరిషత్ అధ్యక్షులు చేపట్టాల్సిన కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు మండల అధికారుల నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ నియామకం చేపట్టారు.



టీచర్ సస్పెన్షన్

ప్రజాశక్తి - మెళియాపుట్టి

విద్యార్థులతో కాళ్లు నొక్కించుకున్న ఘటనలో టీచర్‌ను సస్పెండ్ చేస్తూ సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్న వై.సుజాత కాళ్లు పట్టించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఉపాధ్యాయురాలు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఛార్జిమెమో ఇవ్వగా, వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో సస్పెండ్ చేసినట్లు పిఒ తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తిని విచారణాధికారిగా నియమించామని, విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా తదుపరి చర్య ఉంటుందని తెలిపారు.

11న యువజనోత్సవ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 11వ తేదీన యువజనోత్సవ పోటీలను మునసబుపేటలోని గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని స్పష్టం చేశారు. జానపద బృంద నృత్యం, జానపద గీతాలు, స్టోరీ రైటింగ్, కవిత్వం, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత 9704114705 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.



శ్రీరామనగర్ కాలనీలో మోటారుతో నీటిని తోడుతున్న దృశ్యం

వదలని 'మొంథా' నీటి కష్టాలు

ప్రజాశక్తి - అరసవల్లి

మొంథా తుపాను వర్షాలు తగ్గి వారం రోజులైనా శ్రీకాకుళం నగరంలో ముంపు నీటి కష్టాలు వీడడం లేదు. నగరంలోని సానావీధి, పుణ్యపువీధి, పిఎన్ కాలనీలోని కొన్ని వీధులు, లక్ష్మీటాకీస్ ఎదురుగా తోటపాలెం వెళ్లే దారిలో విశాఖ బి-కాలనీ, బాకర్‌సాహెబ్‌పేట తదితర వీధుల్లో వర్షపు నీరు, మురుగునీరు కలిసిపోయి పిల్ల కాలువలను తలపిస్తున్నాయి. నగరంలోని అనేక వీధుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో నెలల పాటు నీరు నిలిచిపోతుంది. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాల యాజమాన్యం దగ్గర పన్నులు వసూళ్లు చేస్తున్నారు కానీ, వారిని పిలిపించి ఆ స్థలాల్లో ఎత్తుగా మట్టి వేసి, కాలువలను కట్టే విధంగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల లోతుగా ఉన్న ప్రాంతాల్లో ఇళ్లు కట్టడం వల్ల నీరు నిలిచిపోయి ఎక్కడికీ వెళ్లడం లేదని ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాలు కావడంతో చిన్నపాటి వర్షానికే వీధుల రోడ్లపై మోకాలు లోతు వరకు నీరు నిలిచిపోతోంది. బొందిలీపురం, ఇల్లీసుపురం, గోవింద్‌నగర్ కాలనీ, డిసిసిబి కాలనీ, ఇందిరానగర్ కాలనీలో అన్ని వీధులు కూడా రోడ్లపైన నీరు నిలిచిపోయి ప్రజలు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గినా ఆ నీరు మాత్రం నెలలపాటు అలాగే రోడ్లపై నిలిచి ఉండడం వల్ల అవస్థలు తప్పడం లేదు. శ్రీరామ్ నగర్ కాలనీ అయితే రోడ్డుపైన నెలల తరబడి నీరు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



సానావీధిలో నిల్వ ఉన్న వర్షపునీరు

బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం
జిల్లా అధ్యక్షునిగా రాజశేఖరరావు


రాజశేఖరరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా చింతాడ రాజశేఖరరావు ఎన్నికయ్యారు. ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సంఘం నూతన కార్యవర్గం ఎన్నికల్లో అధ్యక్షునిగా రాజశేఖరరావును ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ ప్రతినిధి పి.రామచంద్రరావు పర్యవేక్షణలో ఈ ఎన్నిక నిర్వహించారు. రాజశేఖరరావు ఇసిఇలో ఎంటెక్ జెఎన్‌టియు హైదరాబాద్ నుంచి పూర్తి చేసి మెడికల్ ఇమేజ్ ప్రాసెసింగ్ అనే అంశంపై పరిశోధన చేసి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. విశాఖ పోర్టు ట్రస్టులో కొద్దికాలం గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీగా పనిశారు. అనంతరం బోధనా రంగం వైపు వచ్చారు. 25 ఏళ్ల అధ్యాపక అనుభవాన్ని గడించారు. పలు సంఘాలు, సంస్థల్లో సభ్యునిగా ఉన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా రాష్ట్ర శాఖకు డివిజనల్ కో-ఆర్డినేటర్‌గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. మూడు అటనామస్ ఇంజినీర్ కళాశాలలకు బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యునిగా కూడా ఉన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లోనూ సభ్యత్వం కలిగి ఉన్నారు. పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన చింతాడ రాజశేఖరరావు ఈ పదవికి ఎన్నిక కావడంపై ఆ గ్రామస్తులు, వర్శిటీ సహచర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సిఎం సహాయనిధి అందజేత

శ్రీకాకుళం సిటీ: ముఖ్యమంత్రి సహాయనిధి రూ.28,14,505ను 39 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం విశాఖ ఎ కాలనీలోని కార్యాలయంలో అందజేశారు. నియోజకవర్గంలో అర్హులకు సిఎం రిలీఫ్ ఫండ్ సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. తనకు వచ్చిన వినతులను సిఎం దృష్టికి తీసుకెళ్లి సహకరిస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు.

తప్పకుందామన్నా... స్థలం లేదే?

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్ నుంచి సాధారణ ప్రజలదాకా అందరికీ సుపరిచితమైన, తిరుగాడిన రహదారి అది. కానీ ఆ మార్గంలో ఎదురుగా ఓ వాహనం వస్తే పక్కకు తప్పుకోవాలన్నా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు ప్రయాణికులు, ప్రజలు.

అదే రాచమార్గం... వెళ్తే కష్టమార్గం!

రహదారికి రెండు వైపులా తెగిపోయి, మధ్యలో గోతులు పడి, పక్కనే ఆక్రమణలు విస్తరించడంతో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఫుట్‌పాత్ పేరుతో పెరిగిన దుకాణాలు, క్రమరహిత పార్కింగ్ వెరసి రహదారి రద్దీగా, ప్రమాదకరంగా మారింది.

రాచమార్గమే కానీ కష్టమార్గం!

కవిటి బస్టాండ్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం, జూనియర్ కళాశాల, తహశీల్దార్ కార్యాలయం, వెలుగు, ఎన్‌ఆర్‌జిఎస్ కార్యాలయాలు, ఎంఆర్‌సి, శ్మశాన వాటిక, సముద్ర తీరప్రాంత గ్రామాలు, మండల ఇలవేల్పు చింతామణి అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి అది. కానీ రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, స్థానికులు, అటువైపుగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే కర్షకులు, మేతకు వెళ్లే పశువులతో ఆ మార్గంలో ప్రయాణం సాగించడమే కష్టంగా మారుతోంది. ఇంతరద్దీ మార్గంలో ఎదురుగా ఓ ఆటో వస్తేనే మోటార్ సైకిల్ పక్కకు తప్పుకోవడానికి లేదంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


ఇరుగ్గా ఉన్న ప్రధాన రహదారి

రోడ్డు ఉన్నా... రూపం లేదు

ఇటీవల కలెక్టర్ కవిటిని సందర్శించిన సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయం ఎదుట కొంత చిప్స్ వేసినప్పటికీ, మిగతా రహదారి అంతా దెబ్బతిన్నదే. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇంత దయనీయంగా ఉంటే గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తరచూ ఈ మార్గాన్నే వాడుతున్నా దానిపై శ్రద్ధ చూపకపోవడం ప్రజల్లో అసంతృప్తి రేపుతోంది.

పనులు ఎందుకు ఆగిపోయాయి?

రహదారి మరమ్మతులకు గతంలో ప్రతిపాదనలు సిద్ధమైనా, ఫండ్ల కొరత, టెండర్ ప్రక్రియ నిలిచిపోవడం కారణంగా పనులు అటకెక్కినట్లు తెలుస్తోంది. అయితే ఇంతలో ప్రజలు రోజూ ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం మానవ సహనాన్ని పరీక్షిస్తున్నాయి.

మోక్షమెప్పుడో!

ఇటువంటి పరిస్థితుల్లో ఇటు ఆంధ్ర, అటు ఒడిశా నుంచి చింతామణి అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులతో పాటు స్థానిక ప్రజలు, మత్స్యకార గ్రామస్తులు, కర్షకులు, కార్మికులు, విద్యార్థులు, ముఖ్యంగా మరుభూమికి వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎందరో ప్రజలు ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో అంటూ నిట్టూరుస్తున్నారు.

వ్యవసాయ క్షేత్రాలకు ఇదే దారి



కవిటి, గొండ్యాలపుట్టుగ తదితర ప్రాంతాల ప్రజలు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్దానం ఇలవేల్పు చింతామణి ఆలయానికి వెళ్లేందుకూ ఇదే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటువంటి రహదారి ఆధునికరించి సుందరంగా తీర్చిదిద్దితే మరో విధంగా ఉండేది. మండల కేంద్రం నుంచి సముద్ర తీరానికి చేరుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, నాయకులు స్పందించి ఈ రహదారి ఆధునికీకరిస్తే చాలా బాగుంటుంది.

- ఆరింగి కృష్ణారావు, రైతు, కవిటి

మా గ్రామాలకు ఇదే మార్గం



కొత్తపాలెం, ఇద్దివానిపాలెం, బట్టివానిపాలెం, పెద్ద కర్రివానిపాలెం, చిన్న కర్రికర్రివానిపాలెం గ్రామాలతో పాటు సముద్ర తీర ప్రాంతాల అందాలు ఆస్వాదించేందుకు ఇదే ప్రధాన మార్గం. అయితే ఈ మార్గం ప్రయాణానికి అసౌకర్యంగా, ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా బస్టాండ్ కూడలి నుంచి చింతామణి అమ్మవారి గుడి వరకు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఆ తర్వాత పరిస్థితి సరే సరే. ఇప్పటికైనా స్పందించి రహదారిపై దృష్టి సారించి సుందరీకరిస్తే ప్రజలు హర్షిస్తారు.

- బి.తేజేశ్వరరావు, చిన్న కర్రివానిపాలెం

నిత్యం రద్దీగా ఉంటుంది



ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నేను మెడికల్ దుఖాణంలో ఉంటాను. అధికారులు, నాయకులు, సమస్యల పరిష్కారానికి తిరిగే ప్రజలు, రైతులు మత్స్యకారులు, విద్యాథిలతో నిరంతరం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో పక్కకు తప్పుకోవడానికి కూడా ఉండదు. ఇంతమంది తిరిగిన రహదారి ఈ విధంగా ఉండడం విచారించదగ్గ విషయం. ఇప్పటికైనా దానిపై దృష్టి సారించి ఆధునికీకరిస్తే అందరికీ మంచిది. తీరప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుంది.

- పొల్లాయి ఉమామహేశ్వరరావు, మెడికల్ దుకాణం నిర్వాహకుడు, కవిటి

స్ఫూర్తి నింపిన చెకుముకి ప్రతిభా పరీక్షలు


ఆమదాలవలస : ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

ఎందుకు?, ఏమిటి?, ఎలా? అనే ప్రశ్నలతో విద్యార్థుల మనసుల్లో శాస్త్రస్ఫూర్తిని మేల్కొల్పుతూ కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం చెకుముకి సైన్స్ టాలెంట్ క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 20 పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున వచ్చిన విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో ప్రశ్నోత్తరాల వర్షంలో పిల్లల సమాధానాలు శాస్త్రబుద్ధికి కొత్త వెలుగులు నింపాయి. ఈ పోటీల్లో జెడ్‌పిహెచ్‌ఎస్ ముత్యాలపేట బృందం మొదటి బహుమతి, జెడ్‌పిహెచ్‌ఎస్ మాణిక్యపురం బృందం రెండో బహుమతి సాధించాయి. అనంతరం ఎంఇఒ-1 ధనుంజయ మజ్జి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి, ఆలోచనా శక్తి పెంపొందిస్తాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.విశ్వనాథం విద్యార్థులను ప్రోత్సహిస్తూ, సైన్స్ ఉపాధ్యాయులు గిరిబాబు, అరుణ, ధనలక్ష్మి, కూర్మారావు సమన్వయంతో పోటీలను విజయవంతంగా నిర్వహించారు. చివరిగా విజేతలకు బహుమతులు అందించారు.

ఆమదాలవలస : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యా చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీనగర్ హై స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అక్కులపేట, కొర్లకోట ఎస్‌విఎస్ హై స్కూల్ కు చెందిన విద్యార్థులు ప్రథమ విజేతలుగా ఎంపికయ్యారు. ఈ పోటీల్లో 19 పాఠశాలల నుంచి 22 టీంలతో 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఆర్‌జెడి పాత్రుని పాపారావు, ఎంఇఒలు కె.రాములు, టింగరాజు, రోటరీ క్లబ్ అధ్యక్షులు వీటి చౌదరి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, బుడుమూరు సూర్యారావు, జనవిజ్ఞాన వేదిక మండల నాయకులు టి.వి.టి.భాస్కరరావు ఎం.శ్యామలరావు హెచ్.వి.సత్యనారాయణ, కర్నెన జనార్ధనరావు, కె.షణ్ముఖరావు, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళవారం మండల స్థాయి చెకుముఖి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో జెడ్‌పిహెచ్ దేవలభద్ర, జెడ్‌పిహెచ్‌ఎస్ హరిదాసుపురం. ప్రైవేట్ స్కూల్ నుంచి శ్రీసాయి ఉషోదయ పబ్లిక్ స్కూల్ నిలిచాయి. పై మూడు పాఠశాలలు నవంబరు 23న జిల్లా స్థాయిలో జరిగే పరీక్షకు హాజరవుతారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ జి.నరసింహులు, హెచ్‌ఎంలు కె.హేమలత, సిహెచ్.కృష్ణారావు, ఎల్.గుణశేఖర్. మండల కన్వీనర్, కోకన్వీనర్ కె.కుమారస్వామి, లక్ష్మీపతి, మండల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

మందస: మండలంలోని హరిపురం ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఇందులో కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటరని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు తెలిపారు. పదో తరగతి నుంచి నెయ్యల భార్గవి, 9 నుంచి శిష్టు శశాంక్, 8 నుంచి ఉగ్రిపల్లి అస్మితలు ఉన్నారు.s కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎస్.చిత్రాసేను, జి.సూర్యనారాయణ, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, ఎస్.హారిక పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వమించారు. ప్రశ్నపత్రాలను ఎంఇఒ గట్టు శ్రీరాములు ఆవిష్కరించారు. 13 పాఠశాలల నుంచి 16 జట్లు పాల్గొన్నాయని చెకుముకి జిల్లా కో కన్వీనర్ పూజారి గోవిందరావు తెలిపారు. ఈ పరీక్షలు ప్రథమస్థానం తామాడ మోడల్ పాఠశాలకు, ద్వితీయ స్థానం అదపాక ఉన్నత పాఠశాల నిలిచాయి. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రియ ఉషోదయ పాఠశాల బుడుమూరు విద్యార్థులు జిల్లా స్థాయికి చేరుకున్నారు. విజేతలకు ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రువ్వ పూర్ణచంద్రరావు, చెకుముకి మండల కన్వీనర్ సురవరపు వెంకటరమణ, సభ్యులు కనిమెట్ట పద్మావతి, కిరణ్‌కుమార్, ఆనంద రామారావు, రవిశంకర్ పాల్గొన్నారు.



పొందూరు : ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంఇఒ వాగ్దేవి

టెక్కలి : విద్యార్థి దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించాలనే ఉద్దేశ్యంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చెకుముఖి సైన్స్ ప్రతిభా పరీక్ష టెక్కలి మండలంలో ఘనంగా నిర్వహించబడిందని జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. టెక్కలి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి సుమారు 23 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. వీరిలో టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సీతాపురం జిల్లాపరిషత్ పాఠశాలల నుంచి రెండుబృందాలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల నుంచి ఆరుణా విద్యాలయం, మదర్ థెరిసా పాఠశాలల నుంచి రెండు బృందాలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు, పాలవలస ధర్మారావులు పర్యవేక్షించారని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు ఎన్.శోభారాణి, డి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని నగరంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు ఆధ్వర్యాన చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. నగరంపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం, బాతుపురం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు హెచ్‌ఎం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెవివి కన్వీనర్ మోహనరావు, కృష్ణారావు, ఉపాధ్యాయులు టి.ఎర్రన్న, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నందిగాం : బహుమతులను అందజేస్తున్న ఎంఇఒ నరసింహులు

రణస్థలం రూరల్: మండలంలోని జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు అజ్జాడ త్రినాథరావు, హెచ్‌ఎం బి.రమణయ్య ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 18 ప్రభుత్వం, 3 ప్రైవేటు పాఠశాలల నుంచి 29 టీమ్ పాల్గొన్నాయి. జిల్లా స్థాయికి ప్రభుత్వ విభాగం నుంచి ప్రథమస్థానం బంటుపల్లి జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు టి.గోవిందరాజులు, కె.ఇందు, ఎస్.సందీప్, ద్వితీయ స్థానం ఎపి మోడల్ స్కూల్ కొండములగాం విద్యార్థులు గుణశ్రీ, జి.తేజస్విని, కె.కుమార్‌రాజు, గృతీయ స్థానం జిపి పాఠశాల పైడిభీమవరం విద్యార్థులు విజయం సాధించారు. ప్రైవేటు పాఠశాలల విభాగం నుంచి ప్రథమ స్థానంలో నెలివాడ ఆర్డర్ స్కూల్ నుంచి ఆర్.శ్రావణ్, ఆర్.కీర్తిముఖి, కె.అక్షయలు జిల్లా స్థాయి పోటీలకు వెళ్తారని జన విజ్ఞాన వేదిక కమిటీ మండల బాధ్యులు డి.రాజశేఖర్, పి.లోకేశ్వరరావు తెలిపారు. వీరికి ఆర్డర్ స్కూల్ డైరెక్టర్ వి. ప్రవీణ్, అకాడమిక్ అడ్వాజర్ వి.రమణ, ప్రిన్సిపాల్ జి.అరుణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, గడి బలరాం అభినందించారు.

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం ఎపి మోడల స్కూల్, రెండో స్థానం కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మూడో స్థానం పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠవాలలు నిలిచాయి. ఈ పోటీలకు 13 జట్లు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఇఒలు యం.వాగ్దేవి, పట్టాన రాజారావులు బహుమతులును అందజేశారు. పోటీలలో కన్వీనర్ జి.వి.రమణ, కో-కన్వీనర్‌గా నాగరాజులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాయి మృతదేహం

కొట్టుకొచ్చిన యువకుని మృతదేహం

ఎచ్చెర్ల : మండలంలోని బొంతలకోడూరు సమీపం కాళింగపేట వద్ద శ్రీకాకుళం మంగు వారి తోటకు చెందిన బలగ సాయి (25) మృతదేహం మంగళవారం కొట్టుకొచ్చింది. సాయి శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ సంఘటనా చేరుకున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం తెలియరాలేదు.


రోగులను ఆటోలో తరలిస్తున్న వైద్యులు పాపినాయుడు

రోగులు డిశ్చార్జి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో తీవ్ర గాయాలపాలైన వారిలో తొమ్మిది మందిని ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్చి చేసి ఆటోలో తరలించారు. ఘటన జరిగిన సమయం నుంచి వైద్యులు మెరుగైన వైద్యం అందించారు. వారు కోలుకోవడంతో ఇంటివద్దే మందులు వినియోగించాలని వైద్యులు సూచించారు. బి.పుష్పలత, పిన్నింటి నాగమ్మ, రేగుల హరికృష్ణ, గున్న చిట్టమ్మ, పిన్నింటి గౌరి, దుంప భారతి, టొంపల వెంకమ్మ, దట్టి అడ్డమ్మలు డిశ్చార్చి అయిన వారిలో ఉన్నారు. వీరు పూర్తిగా కోలుకోవడానికి ఇంకా ఆరు వారాల సమయం పట్టే అవకాశం ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినేని పాపినాయుడు, డాక్టర్ కూన మోహన్ బాబు తెలిపారు.


యంత్రాలతో గోతులను పూడ్చుతున్న అధికారులు

గోతులు పూడ్చివేత
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు-చిలకపాలెం రహదారిలో కృష్ణాపురం సమీపంలో ఏర్పడిన భారీ గోతులను ఆర్అండ్‌బి ఎఇ పి.టి.రాజు ఆధ్వర్యాన మంగళవారం పూడ్చివేశారు. గత నెల 31న 'ప్రజాశక్తి'లో 'ప్రమాదకరంగా రహదారిపై గుంతలు' అంటూ ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బి అధికారులు స్పందించారు. ఈ ప్రాంతంలో స్టోన్ క్రషర్లు ఉండడం, గ్రావెల్ మట్టిని భారీ వాహనాలతో అక్రమంగా తరలిస్తుండడంతో రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు కారణంగా ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు రహదారిపై ఏర్పడిన గుంతలను వెట్‌మిక్చర్‌తో పూడ్చివేయడంతో పాటు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేలా ఎస్ఐ వి.సత్యనారాయణ వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయడంపై మండలంలోని పలు గ్రామాల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ, మరలా గుంతలు ఏర్పడకుండా శాశ్వతంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

టెక్కలి : టెక్కలి ఆర్‌టిసి డిపో పరిధిలోని పలు గ్రామాల్లో నడుపుతున్న ఆర్‌టిసి సర్వీసులపై ప్రయాణికుల సలహాలు, సూచనలు ఇచ్చేందుకు బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నామని మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో ప్రయాణికులు పాల్గొని తగు సలహాలతో, సూచనలతో పాటు సందేహాలనూ నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు 9959225611 మైబైల్ నంబరును సంప్రదించాలని కోరారు.

కళాశాలలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.నవ్యశ్రీ మహంతి ఆధ్వర్యాన మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో లోపింటి మానక ప్రథమ, అసి చందు ద్వితీయ, రామిరెడ్డి తృతీ బహుమతులు గెలుపొందారు. వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి అంజలి బెహరా, ద్వితీయ బహుమతి అసి చందు, తృతీయ బహుమతి వై.అర్చన ప్రియ గెలుపొందారు. క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి అంజలి బెహరా, ద్వితీయ బహుమతి లోపింటి మీనక, తృతీయ బహుమతి అర్చన ప్రియా విజయం సాధించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

గీత కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న సంఘ నాయకులు

సంతబొమ్మాళి : ప్రాచీన కల్లుగీత వృత్తిని జీవనాధారంగా చేసుకున్న గీత కార్మికులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఎపి కల్లుగీత కార్మిక సంఘం తీవ్రంగా మండిపడింది. కోడూరు సొసైటీ ఆధ్వర్యాన పాలతలగాంలో గీత కార్మికుల సమావేశంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గొర్లె ఎర్రయ్య, కార్యదర్శి దుబ్బ కోటేశ్వరరావు మాట్లాడారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. పైగా విధానాల ద్వారా వారిని అణగదొక్కుతోందని ఆరోపించారు. చెట్లపై పన్ను రద్దు చేయడం ద్వారా గీత సొసైటీలను బలహీనపరచే ప్రయత్నం చేస్తుందన్నారు. కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా, బెల్ట్‌షాపుల ద్వారా విక్రయాలు కొనసాగిస్తూ ప్రభుత్వం గీత వృత్తికి దెబ్బతీస్తోందని విమర్శించారు. గీత కుటుంబాలను ఆదుకునేలా కొత్తకల్లు పాలసీ రూపొందించాలన్నారు. వృత్తిని ఆధునికీకరించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణరావు, లక్ష్మణ రావు, శ్రీనివాస్, కృష్ణరాజారావు, ప్రసాద్, వీరస్వామి, రామ్మూర్తి, త్రినాథరావు, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

కార్మిక చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లు చెల్లించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ పనస రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొత్తూరులో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ క్లయిమ్‌లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్న నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లయిమ్‌లను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో టిడిపి కూటమి హామీ ఇచ్చిందని గుర్తించారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అవుతున్నా భవన వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధంచలేదన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పమిడి శ్రీను, ఈది రామారావు, వంక ఆనందరావు, పనస సూర్యనారాయణ, పోలాకి శంకర్. కె.శ్రీను, బుడ్డ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న హరిబాబు

పలాస : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసిలాటకు సంబంధించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిలా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గాయపడిన వారికి సరైన వైద్యం అందుతుందో? లేదో? అని అడిగి తెలుసుకున్నారు. అందరికీ నష్టపరిహారం అందిందా? లేదా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులు డాక్టర్లు టి.పాపినాయుడు, కూన మోహన్‌బాబులను క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండ


కంచిలి : ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కంచిలి : మండలంలోని సాలినపుట్టుగలో ఇటీవల తుపానుకు గొడకూలి ఇబ్బందులు పడుతున్న సాలిన ఢిల్లీరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రూ.వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే వైసిపి మండల అధ్యక్షులు వజ్జ వమృయంజయరావు రూ.5 వేలు, కొల్లి ఈశ్వరరావు రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి పైల దేవదాసురెడ్డి, సాలిన లక్ష్మణమూర్తి, దుర్గాసి ధర్మారావు, గుమ్మడి రాందాసు, మడ్డు వెంకటరావు, ఎలుసూరి అప్పారావు, జగ్గారావు, బాస్కరరావు, తమ్మయ్య, బాలాస్వామి, దాలయ్య, దుర్యోధన పాల్గొన్నారు.

బూర్జ : బూర్జలో తుపాను కారణంగా ఇంటి గోడలు కూలిపోయిన బాధితులకు తహశీల్దార్ వై.వి.పద్మావతి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, రూ.వెయ్యి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తుపాను ప్రభావిత బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బాబూరావు, ఎంపిటిసి చొక్కార పోలినాయుడు, నీటి సంఘం అధ్యక్షులు వ్యాపార కవితమ్మ పాల్గొన్నారు.

కవిటి: మొంథా తుపాను ప్రభావానికి గురైన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, చెప్పిన విధంగానే తీరప్రాంత మత్స్యకారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్టు ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు తెలిపారు. మండలంలోని కపాసుకుద్దిలో మంగళవారం 800 మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమం లో నాయకులు సీపాన వెంకటరమణ, బాసుదేవ్‌రౌళో, బడే గురుమూర్తి, పుల్లట సంతోష్, పుల్లట రాజు పాల్గొన్నారు.


కవిటి : సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు


యోగ్యతా పత్రాన్ని అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

'భాష్యం'లో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు స్థానిక లయన్స్ క్లబ్ మంగళవారం ప్రిన్సిపాల్ పి.వి.వి.శేషుకుమార్ ఆధ్వర్యాన భాష్యం పాఠశాలలో శాంతి సందేశాత్మక చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన 40 మంది విద్యార్థులకు యోగ్యత పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిపిసి జిల్లా చైర్మన్ ఎం.ఎస్.ఎన్.మూర్తి, లయన్స్ ప్రతినిదులు డాక్టర్ వై.మల్లిబాబు, అంకం ధర్మారావు, ఎ.ఆదినారాయణ, జి.అప్పలసూరి, ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

నారీశక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- లావేరు

మహిళలకు రక్షణ కల్పించే దిశగా నారీ శక్తి యాప్‌ను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత సురేష్ తెలిపారు. మండలంలోని తాళ్లవలస పంచాయతీలో నారీశక్తి యాప్‌పై మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారీశక్తి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు చేస్తున్నాయని, వీటిపై, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియా యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయలక్ష్మి, హెచ్‌సి ఉమారాణి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సుజాత, తదితరులు



శిక్షణ ఇస్తున్న సునీత

చిరుధాన్యాలపై వృత్తి శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఈ నెల 3 నుంచి 5 వరకు మూడు రోజులపాటు 'చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ'పై వృత్తి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత అన్నారు. ఈ వృత్తి శిక్షణ కార్యక్రమంలో మహిళలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు కలిగి ఉండటంతో పాటు వాటిని రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మధుమేహం, గుండె జబ్బులు, కొన్ని రకాల కేన్సర్ల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. రెండు గ్లాసుల పాలలో లభించే క్యాల్షియం ఒక గ్లాసు రాగి జావలో లభిస్తుందని, ఖనిజ లవణాలు అధికంగా ఉండటంతో వీటిని పోషక గనులు అని కూడా పిలుస్తారని తెలిపారు. కెవికె ఉట్టుకూరు నుంచి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రశాంతి ఆన్‌లైన్ ద్వారా చిరుధాన్యాల ప్రాథమిక ద్వితీయ ప్రాసెసింగ్ విధానాలు, వాటి యంత్ర సామగ్రి బ్రాండింగ్ ప్యాకింగ్ మార్కెటింగ్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రాయోగిక భాగంలో డాక్టర్ సునీత రాగి మురుకులు జొన్న పకోడీ రాఖీ పకోడీ జొన్న రిబ్బన్ పకోడీ రాగి లడ్డు వంటి పంట ఆధారిత ఆహార పదార్థాలను తయారు చేయడం పాల్గొనువారికి నేర్పించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్లు బాలకృష్ణ, హరికుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


మెమొంటోను అందజేస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

సోలార్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన రష్యాకు చెందిన ఊరల్ ఫెడరల్ విశ్వవిద్యాలయం సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ కుమార్ ముఖ్య ప్రసంగకర్తగా పాల్గొని 'రాబోయే తరంలో సోలార్ ఫొటోవోల్టాయిక్ ప్యానెల్‌ల కోసం స్మార్ట్ కూలింగ్ సొల్యూషన్స్' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సులో సోలార్ ప్యానెల్‌ల ఉష్ణ నియంత్రణ విధానాలు, స్మార్ట్ శీతలీకరణ సాంకేతికతల అభివృద్ధి, శక్తి సామర్థ్య పెంపు వంటి అంశాలపై విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారన్నారు. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా పరిశోధనాత్మక దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమానికి మెకానికల్ విభాగ అసిస్టెంట్ హెచ్‌ఒడి డాక్టర్ ఆర్. శివశంకరరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.భానుచంద్రరావు సమన్వయపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ పి.శ్రీహరి పాల్గొన్నారు.

పరీక్షా విధానంపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ విడుదల చేసిన సోషల్ స్టడీస్ మోడల్ పేపర్లు విద్యార్థులకు పరీక్షల తయారీలో అత్యంత సహాయకారిగా ఉంటాయని, వీటిని ఉపయోగించడం వల్ల విద్యార్థులు తమ పరీక్షా విధానంపై స్పష్టమైన అవగాహనను పొంది, మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారని పాతర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.వెంకటేశ్వరరావు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ మోడల్ పేపర్లు సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు బి.దేవి, పి.కృష్ణపాప ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ పేపర్ సహాయంతో,


మోడల్ పేపర్లను అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు ప్రశ్నపత్రం రూపకల్పన (బ్లూప్రింట్), మొత్తం మార్కులు, సమయ పరిమితి, ప్రశ్నల రకాల అతి స్వల్ప, స్వల్ప, వ్యాసరూప ప్రశ్నలు గురించి తెలుసుకోగలరని అన్నారు. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు అనేదానిపై ముందుగా అంచనా వేయడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఏ విభాగంపై ఎంత సమయం కేటాయించాలి అనే సమయ నిర్వహణ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, సమయాన్ని వృథా చేయకుండా, ప్రతి ప్రశ్నకు తగినంత సమయం కేటాయించడం అలవాటవుతుందన్నారు. పరీక్షలకు ముందు దీనిని సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, పరీక్ష భయాన్ని తగ్గిస్తుందని ?వివిధ రకాల ప్రశ్నలకు సక్రమంగా ఎలా సమాధానం రాయాలనే దానిపై అవగాహన లభిస్తుందన్నారు. చక్కగా, స్పష్టంగా అవసరమైన సమాచారాన్ని మాత్రమే పొందుపరుస్తూ సమాధానాలు రాయడంలో ప్రావీణ్యం పొందవచ్చునన్నారు.మోడల్ పేపర్‌ను ఉపయోగించడం అనేది 'ట్రయల్ రన్' లాంటిదని అన్నారు. ఇది విద్యార్థులకు నిజమైన పరీక్ష వాతావరణాన్ని అనుభూతి చెందడానికి, తమ సన్నద్ధతను మెరుగుపరచుకోవడానికి ఒక అద్భుతమైన సాధనమని అన్నారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు

ధాన్యం సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యాన్ని ఆర్‌ఎస్‌కె ద్వారా కొనుగోలు చేయనున్నట్లు రణస్థలం, లావేరు తహశీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు తెలిపారు. 2025-26 ఖరీఫ్ ధాన్యం సేకరణపై మండల పరిషత్ కార్యాలయంలో రణస్థలం, లావేరు మండల వ్యవసాయ సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, తదితర శాఖల సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రణస్థలం, లావేరు మండలంలోని రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. రణస్థలం, లావేరు మండల వ్యవసాయాధికారులు విజయభాస్కరరావు, రమేష్ నాయుడు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా ఆదుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని అన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

లావేరు : మండలంలోని గోవిందపురానికి చెందిన పంచాయతీ టిడిపి నాయకుడు ఇజ్జు బాబూరావును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం పరామర్శించారు. బాబూరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్యం విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, బిజెపి మండల అధ్యక్షుడు లుకాలపు అప్పలనాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నిడిగంట్ల త్రినాథ్, చిక్కాల ఎల్లన్నదొర, అదపాక రామారావు పాల్గొన్నారు.

పిపిపిని వ్యతిరేకించాలి

ప్రజాశక్తి- పొందూరు

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఆమదాలవలస వైసిపి ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని దల్లవలస, పిల్లలవలస, వి.ఆర్.గూడెం, ధర్మపురం గ్రామాల్లో మంగళవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. పేదవాళ్లకు ప్రభుత్వ వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తే... కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజాఅభిప్రాయాన్ని సేకరించేలా ఈ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి నాయకులు


పొందూరు : సంతకాల సేకరణ చేస్తున్న వైసిపి నాయకులు

చింతాడ సత్యప్రసాద్, కిల్లాన సూర్యారావు, కిల్లాన రమణ, మజ్జి గోపాలకృష్ణ, గుడ్ల మోహనరావు, పైడి నాగభూషన్, గాడు నాగరాజు, కెల్ల సురేష్, మురళీ, రమణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం భావనపాడు, మర్రిపాడు గ్రామాల్లో సోమవారం టిడిపి ప్రభుత్వంపై ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బుడ్డ మోహనరెడ్డి, పాల వసంతరెడ్డి, కోత సతీష్, నక్క భీమరావు, రాజ్యలక్ష్మి, అంగ అప్పారావు, మార్పు నాగభూషణరావు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

పోలాకి : కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానానికి వచ్చే సందర్శకులు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించి, ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలి సిఐ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రాజారాంపురం సముద్ర ప్రాంతాన్ని ఎస్ఐ రంజిత్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు విధుల్లో ఉన్న ప్రదేశంలో, వారి సూచనలను అనుసరించి మాత్రమే సముద్ర స్నానాలకు దిగాలన్నారు. ఎక్కువ దూరం లోపలకు పోకుండా, అలలకు ఎదురు పోకుండా జాగ్రత వహించాలన్నారు. ఇటీవల వచ్చిన తుపాను ప్రభావం వల్ల సముద్రంలో కొన్నిచోట్ల గుంతలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందుకు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్ర తీర ప్రాంతంలో మద్యం సేవించడం, గందరగోళం సృష్టించడం, ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలు చేయకూడదన్నారు. ఎవరైనా ప్రమాదంలో పడ్డారనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న పోలీస్ సిబ్బంది, లైఫ్ గార్డులకు తెలియజేయాలన్నారు. అలాగే మెరైన్ పోలీస్ కంట్రోల్ రూమ్ 1093, అత్యవసర పరిస్థితి అయితే 100, 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


ప్రతిభ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : ఈ నెల 2న జిల్లా స్థాయిలో నిర్వహించిన జూడో క్రీడలో అండర్-17 విభాగంలో పోలవరం స్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ డిఇఒ విలియమ్స్ తెలియజేశారు. జిల్లాస్థాయి ఎంపికల్లో ఎన్.మనీషా అండర్ 44 కేజీ, కె.శిరీష అండర్ 52 కేజీ, కె.అభిషేక్ అండర్ 40 కేజీ, జి.భాస్కర్ అండర్ 55 కేజీల విభాగాల్లో ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు తెలిపారు. వీరు ఈ నెల 7, 8, 9 తేదీల్లో డిఎస్ఎ స్టేడియం కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిశేషు, జగదీశ్వరరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.


పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ముంపు పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- కవిటి

మొంథా తుపాను తర్వాత పాక్షికంగా ముంపునకు గురైన వరి పొలాలను అధికారులు, శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఎడిఎ భవానీశంకర్ అధ్యక్షతన ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయకుమార్, భాగ్యలక్ష్మి పొలాలు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా పాక్షిక ముంపు తగ్గిన తరువాత కొజ్జిరియాలోని పొలాల్లో ఆకుముడత, పొడతెగులు పీడకాలు కనిపించినట్లు గుర్తించారు. వీటి నివారణకు లీటరు నీటికి అసిఫేట్ 1.5 గ్రాములు, హెక్సాకొనాజోలు 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ చర్యలతో పంట నష్టాన్ని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ఈ పర్యటనలో ఎఒ శ్రీదేవి, విఎఎ నిర్మల, కొజ్జిరియా గ్రామ రైతులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్


పి.ఎం.జె బాబుకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పి.ఎం.జె.బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బాబును ఎమ్మెల్యే గొండు శంకర్ నగరంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి బాబుకు ఏ బాధ్యతలను అప్పగించినా దాన్ని చిత్తశుద్ధితో స్వీకరించి పూర్తి చేసే వారని అన్నారు. అటువంటి వ్యక్తికి డైరెక్టర్ పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. టిడిపిలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ యశోదలక్ష్మి, తహశీల్దార్ శిర్ల గణపతి, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

వరహాల గెడ్డలో పూడికతీత

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల వరహాల గెడ్డలో మంగళవారం కూటమి నాయకులు పూడికలు తీయించారు. మొంథా తుపాను కారణంగా గెడ్డలో కొట్టుకొచ్చిన కర్రలు, చెట్లు, ఇతర వ్యర్థాలు గెడ్డలో పేరుకుపోయాయి. కార్తీక మాసంలో మహిళలు దీపాలు పెట్టేందుకు, స్నానాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన కూటమి నాయకులు నడుం బిగించారు. గెడ్డలో పేరుకుపోయిన చెత్త చెదారం, చెట్లు కర్ర దుంగలు ఇతర వ్యర్థాలను ట్రాక్టర్ సహాయంతో శుభ్రం చేశారు. అందుకు ఖర్చులను కూటమి నాయకులు ఆల్ల కృష్ణారావు వెచ్చించారు. కార్యక్రమంలో వడ్డి యాదగిరి, ఆళ్ల వెంకట్రావు, తామడ మోహనరావు, ఆళ్ల ధర్మారావు, ఆళ్ల జయంత్, గరికి కృష్ణారావు పాల్గొన్నారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వైకుంఠరావు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సైన్స్ ఎగ్జిబిషన్ ఢిల్లీ ప్రోగ్రాంకు పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి పాండవ దీపక్ కుమార్ ఎంపిక య్యారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ వైకుంఠరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందిస్తూ... ఢిల్లీ ప్రయాణానికి పంపించారు. విద్యాశాఖ రాష్ట్రం మొత్తం 52 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, అందులో పురుషోత్తంపురం ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

టెక్కలి : మండలంలోని సవరకిల్లి, సన్యాసినీలాపురం, డమర గ్రామాల్లో మంగళవారం లింగాలవలస గ్రామీణ వైద్యశాల ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం నిర్వహించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయసేవా విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సేవా శిబిరాల్లో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాలకు చెందిన వారికి బిపి, సుగర్ రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లింగాలవలస పిహెచ్‌సి వైద్యులు అప్పారావు, ఫాల్గుణరావు పర్యవేక్షణలో సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ సేవా విభాగం పిఒలు డి.వాసుబాబు, కందిగోళ్ల వి.లూక్‌పాల్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అల్లెనలో జల జీవన్ ఉత్సవం

బూర్జ : మండలంలో అల్లినలో మంగళవారం జలజీవన్ ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు పెద్దఎత్తిన ఏర్పాటు చేశామన్నారు. అన్ని వీధుల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిని ఏర్పాటు చేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటిని వృథా చేయకుండా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జెఇ ఎం.వికె.నాయుడు, మాజీ సర్పంచ్ గేదెల బాలచంద్రమనేశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన

ఎచ్చెర్ల : మండలంలోని కుప్పిలి, బుడగొట్లపాలెం గ్రామాల మత్స్యకారులకు రిలయన్స్ ఫౌండేషన్ సూపరింటెండెంట్ బి.లక్ష్మణరావు తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. సముద్రంలో అలలు ఎత్తు, గాలి, సముద్ర పరిస్థితుల గురించి వివరించారు. వాతావరణ సమాచారం, విపత్తుల నిర్వహణ సంస్థ ఇన్ కాయిస్, ఐఎండితో కలిసి రియల్ టైం సమాచారాన్ని 24/7 టోల్ ఫ్రీ నంబరు ద్వారా సకాలంలో చేరవేశామని అన్నారు. కార్యక్రమంలో పోలీసు, శ్రీను పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీ కంబాలపేటలో ఉన్న ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో మూడో కార్తీక సోమవారం కోసం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఆవరణలో సన్నాహక సమావేశం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించారు. మూడో సోమవారం దర్శనానికి తరలి వచ్చే యాత్రికులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే రోజు భారీగా అన్నదానం ఉంటుందన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

సాధనతోనే ముందుకు

వజ్రపుకొత్తూరు : విద్యార్థులు సాధన చేసి మనోగణితంలో నిష్ణాతులు కావాలని హుకుంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెట్ట మోహనరావు పేర్కొన్నారు. హ్యూమన్ కంప్యూటర్‌గా ప్రసిద్ధి చెందిన భారతీయ మహిళా గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతి కార్యక్రమం మంగళవారం హుకుం పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. 13 స్థానాల సంఖ్యను మరో 13 స్థానాల సంఖ్యతో గుణకార లబ్ధ విలువను కేవలం 28 సెకన్లలో తెలియజేసిన గొప్ప మనోగణిత వేత్త అని ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణ, జి.సుభాష్, సిహెచ్ సుగుణ, ఎ.స్వాతి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ దాసురాజు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలంలోని మరువాడలో వరుస వర్షాల కారణంగా పలు రైతుల పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు భారీగా పంట నష్టం రావడంతో నష్టం అంచనాలు వేసి నష్టపరిహారం ఇప్పించాలని సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, దాసురాజు కోరారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వానిదే బాధ్యత

పలాస : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాటలో 9 మంది మృతి, మరో 18 మంది గాయపడడం బాధాకరమని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బిసివై పార్టీ అధినేత బోడె రామచం ద్రయాదవ్ అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన కుటుంబాలకు కుటుంబాలకు రూ.50 వేలు, గాయలతో చికిత్స పొందుతున్న వారికి రూ.10వేలు నగదు సహాయాన్ని అందించారు.

పారిశుధ్య పనులు పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని కొసమాలలో మంగళవారం డ్రైనేజీల శుభ్రపరిచే పనులు చేపట్టారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ వేశారు. గ్రామ పరిశుభ్రతను కాపాడేందుకు ఈ కార్యక్రమాన్ని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు ఆధ్వర్యాన చేపట్టారు. ఈ పనులను ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ మలినాలు పేరుకుపోకుండా ప్రతి వారమూ డ్రైనేజీలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

హిందీ మెటీరియల్స్ పంపిణీ



ఇచ్ఛాపురం : మండలంలోని కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ అధ్యాపకులు నరేంద్రనాథ్ పట్నాయక్ పదో తరగతి హిందీ మెటీరియల్స్‌ను తయారు చేశారు. వీటిని ప్రధానోపాధ్యాయులు ప్రమీలకుమారి మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, ధర్మరాజు, ఉప్పాడ పాపారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాజాతా

సైబర్ మోసాలపై కళాజాతా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సైబర్ మోసాలపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన అవసరమని డే అండ్ నైట్ ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కళాజాతర బృందాలతో సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పరిస్థితి, జరుగుతున్న మోసాలు, ఖాతాలు నుంచి కోల్పోతున్న నగదు వంటి అంశాలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెవైసి లేని కారణంగా మొబైల్, బ్యాంకు సేవలు నిలిపివేస్తామని అన్నారు. ఫార్సెల్ వచ్చిందని జరిమానా చెల్లించాలన్నారు. పోలీస్ అధికారులమని, కేసులు మీపై ఉన్నాయని, మీ బంధువులను అరెస్టు చేశారని, స్టాక్ మార్కెట్‌లో పెట్టబడులు పెడితే రోజుల వ్యవధిలో కోట్లు సంపాదించవచ్చునని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం డిపోజిట్ చేయాలని, లాటరీ గెలిచారని, మీ అకౌంట్‌లో తప్పుగా డబ్బులు చేరాయని, పన్ను నుంచి మినహాయింపు వస్తుందని, ఎపికె ఫైల్ వంటి మెజేస్‌లు వస్తే స్పందించ వద్దని అన్నారు. వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కళాజాతర రాజమహేంద్రవ రానికి చెందిన విభూతీ బ్రదర్స్ ప్రదర్శించారు.

బెల్టుషాపులకు మద్యం తరలిస్తే లైసెన్స్ రద్దు

ఎక్సైజ్ సిఐ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి మండలంలోని ఎక్కడైనా బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తే షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ మెచ్చరించారు. మంగళవారం పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంలో 18 మంది బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలాల్లో బెట్టు దుకాణలను నిర్మూలిస్తున్నామని అన్నారు. బెల్ట్ షాపుల విషయంలో ఎక్కడా రాజీలేదన్నారు. పోలీసు, రెవెన్యు అధికారులు సహాయ సహకారాల కోసం లేఖ రాసినట్లు తెలిపారు. ఒడిశా మద్యం సమాచారం, బెల్ట్ షాపులు సమాచారం తెలియజేయాలని కోరారు.


బైండోవర్ చేస్తున్న తహశీల్దార్, ఎక్సైజ్ సిఐ

'ఆశా'లు అందుబాటులో ఉండాలి

కొత్తూరు : ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని కురిగాం పిహెచ్‌సి వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ సూచించారు. మండలంలోని కురిగాం పిహెచ్‌సి పరిధిలోని ఆశా కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశాలందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సూపర్‌వైజర్ బుచ్చిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం


ఇందిరా (ఫైల్)

అరసవల్లి: నేత్రదానం.. మహాదానమని శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోనరావు అన్నారు. అరసవల్లికి చెందిన మాడుగుల ఇందిరా (36) మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని భర్త సత్యనారాయణ, కుటుంబ సభ్యులు ఎంవిఎల్ కాంతం, దివ్య నిర్ణయించుకున్నారు. నేత్రదానం విధిని రెడ్‌క్రాస్ మేనేజర్ సతీష్, చైర్మన్ జగన్మోహనరావుకి తెలియజేశారు. కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, చిన్ని కృష్ణల ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మృతికి సంతాపం తెలియజేశారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- సోంపేట

ప్రతి విద్యార్థీ సామాజిక బాధ్యతతో మెలగాలని ప్రభుత్వం బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. సోంపేట పట్టణంలోని మహర్షి విద్యానికేతన్‌లో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాలను మంగళవారం ప్రారంభించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించించారు. ముందుగా చిన్నారులు ప్రముఖులకు కోలాటంతో స్వాగతం పలికి పూల వర్షం కురిపిస్తూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతి కార్యక్రమాలు చూపరులకు కనువిందు చేశారు. అనంతరం స్కూల్ యజమాని విప్‌కు, శివాజీకి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు జోరాడు, కృష్ణంరాజు, పాఠశాల యాజమాన్యం జివిఎస్ఎస్ ప్రసాద్, మురళి, ఎల్. శకుంతుల, ఎ.పి.రోజరాణి పాల్గొన్నారు.


జ్ఞాపికను అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

'జైహింద్' స్నేహహస్తం

కవిటి: మనిషికి ఆపద వచ్చినప్పుడు తోడుగా నిలిచే చేతులే నిజమైన స్నేహితులు. రాజపురం ప్రభుత్వ హైస్కూల్‌లో 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పాత స్నేహితులు ఈ మాటకు అర్థం చూపించారు. తమతో చదువుకున్న మిత్రుడు గురునాథ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి ఆర్థిక పరిస్థితి తెలిసిన స్నేహితులు అందరూ కలసి వారి కుటుంబానికి రూ.8 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ స్నేహస్ఫూర్తికి జైహింద్ సేవా ఫౌండేషన్ ప్రేరణగా నిలిచిందని వారు తెలిపారు. 'సహచరుడి కష్ట సమయంలో అండగా నిలవగలగడం మన బంధం విలువను మరింత పెంచుతుంది' అంటూ కార్యక్రమంలో పాల్గొన్న స్నేహితులు భావోద్వేగంతో పేర్కొన్నారు. అనంతరం తన మిత్రులందరికీ, స్ఫూర్తినిచ్చిన జైహింద్ సేవా ఫౌండేషన్‌కి గురునాథ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



నగదు అందిస్తున్న స్నేహితులు

మాదకద్రవ్యాలతో ముప్పు

వజ్రపుకొత్తూరు : మాదకద్రవ్యాల వినియోగం వద్దు... సంతోషకరమైన జీవితం ముద్దు అని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన డ్రగ్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం, సిగరెట్, డ్రగ్స్‌కి దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ల దూరంటూ చదువుపై దృష్టిసారించాలన్నారు. నడవడిక, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని మీ తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కేశవ, ఝాన్సీ, ఎన్ఎస్-ఎస్ పిఒ రూప్ సుందర్, రాంబాబు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిహార్